

పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ఏలూరు:స్థానిక గానుగులపేటలోని వీరమాచినేని విమలాదేవి మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ గురువారం ఆకస్మిక తనిఖీచేశారు. అరగంటపాటు పిల్లలకు బోధించే తీరును కలెక్టర్ పరిశీలించారు. కొద్దిసేపు ఉపాధ్యాయుడిగా మారిపోయారు. ఆయా పాఠ్యాంశాలకు సంబంధించి విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగారు. పాఠశాలకు ఎంతమంది విద్యార్థులు హాజరైంది వంటి వివరాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలన్నారు. పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లను పరిశీలించి నిర్వహణతీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.



చింతలపూడి మండలంలో మిచౌంగ్ తుపానుకు దెబ్బతిన్న వరిపైరు (ఫైల్)

పూర్తయిన ఖరీఫ్ పంటనష్టం నమోదు ప్రక్రియ
గ్రామ సచివాలయాల వద్ద జాబితాల ప్రదర్శన
మరో నాలుగు రోజుల్లో తుదిజాబితా విడుదల
90 శాతం భూయజమానుల పేర్లే నమోదు
ఇ-క్రాప్ పేరుతో కౌలురైతులకు తీరని అన్యాయం

భూయజమానులకే పరిహారం..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్‌లో పంట నష్టపోయిన కౌలురైతులకు తీరని అన్యాయం జరుగుతోంది. పంటనష్టం నమోదులో 90 శాతం భూయజమానుల పేర్లే నమోదయ్యాయి. దీంతో పెట్టుబడి పెట్టి నష్టపోయిన కౌలురైతులకు పంట నష్టపరిహారం అందే పరిస్థితి లేకుండాపోయింది. రెండు జిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు నాలుగు లక్షల ఎకరాలకుపైగా రైతులు వరిసాగు చేశారు. మిచౌంగ్ తుపాను విరుచుకుపడటంతో ముఖ్యంగా వరిసాగుపై తీవ్ర ప్రభావం చూపించింది. పెద్దఎత్తున పంట దెబ్బతింది. ప్రాథమిక అంచనాల ప్రకారం దాదాపు లక్షా 30 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు తేల్చారు. పూర్తిస్థాయిలో పంటనష్టం నమోదుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీంతో ఆ ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. అభ్యంతరాల స్వీకరణ కోసం సచివాలయాల వద్ద జాబితాలను ప్రదర్శించారు. అభ్యంతరాల పరిష్కారం అనంతరం జిల్లా ఉన్నతాధికారులకు జాబితా చేరనుంది. ఈ నెల 26వ తేదీ రెండు జిల్లాల్లో ఎంత పంట నష్టం జరిగిందో స్పష్టత రానుంది. అయితే సచివాలయాల వద్ద ప్రదర్శించిన జాబితాలు చూసి కౌలురైతులు లబోదిబోమంటున్నారు. పంట నష్టపోయిన వాస్తవ సాగుదారుని పేర్లు జాబితాలో లేకుండాపోయాయి. ఇ-క్రాప్ ఆధారంగా పంటనష్టం నమోదు ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు అదేవిధంగా ప్రక్రియను పూర్తి చేశారు. ఇ-క్రాప్‌లో భూయజమానుల పేర్లే ఉన్నాయి. దీంతో పంటనష్టం నమోదు జాబితాలోనూ అవే పేర్లను అధికారులు చేర్చారు. మిచౌంగ్ తుపాను దెబ్బకు పొలాలు నేలనంటి నీటిలో నాని దెబ్బతిన్నాయి. ఎకరాకు రూ.30 వేలకుపైగా రైతులు పెట్టుబడులు పెట్టారు. మూడెకరాలు సాగు చేసిన రైతు దాదాపు రూ.లక్ష వరకూ నష్టపోయారు. పదెకరాలు సాగు చేసిన రైతులు రూ.మూడు లక్షల వరకూ నష్టపోయిన పరిస్థితి నెలకొంది. పంటనష్టం నమోదులో మాత్రం దెబ్బతిన్న కౌలురైతుల పేర్లు చేరలేదు. దీంతో ప్రభుత్వం అందించే సాయం కౌలురైతులకు అందని ద్రాక్షగా తేలిపోయింది. దీంతో కౌలురైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అధికారులను ప్రశ్నిస్తే మీ భూయజమానితో మాట్లాడుకోవాలంటూ చెబుతున్న పరిస్థితి నెలకొంది. భూయజమానిని అడిగితే వచ్చే సీజన్‌లో పొలం సాగుకు కౌలుకు ఇచ్చే పరిస్థితి లేకుండాపోవడంతో కౌలురైతులు మౌనంగా రోదిస్తున్నారు. వైసిపి ప్రభుత్వం కౌలుచట్టంలో మార్పులు చేసి కౌలురైతులను కోలుకోలేని దెబ్బతీసింది.



కౌలు రైతులకు న్యాయం జరిగేదెలా

ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలకు సంబంధించి రూపాయి పెట్టుబడి కూడా భూయజమానులు పెట్టలేదు. అటువంటప్పుడు ప్రభుత్వం అందించే సాయం వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు కాకుండా భూయజమానికి ఇస్తే ఏవిధంగా మేలు జరుగుతుందో ప్రభుత్వం చెప్పాలి. ఇదే తరహాలో పంట నష్టపరిహారంతోపాటు బీమా సొమ్ము సైతం భూయజమానుల జేబుల్లోకి వెళ్లిపోనుంది. గడిచిన ఐదేళ్లలో జిల్లాలో కౌలురైతుల ఆత్మహత్యలు పదుల సంఖ్యలో చోటుచేసుకున్నాయి. దీనికి ప్రధానకారణం పంటను కోల్పోతున్న కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందకపోవడమే. ప్రభుత్వం తమను ఆదుకుంటుందనే భరోసా వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు లేకుండాపోయింది. రెండు జిల్లాల్లోనూ మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. 80 శాతం సాగు కౌలురైతులే చేస్తున్నారు. దీనిలో పది శాతం మంది కౌలురైతుల పేర్లు కూడా పంటనష్టం నమోదు జాబితాలో చేరలేదు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో కౌలురైతుల్లో తీవ్ర ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. వైసిపి ప్రభుత్వం కౌలురైతులను పక్కనపెట్టి భూయజమానులకు కొమ్ముకాస్తుందంటూ విమర్శలు విన్పిస్తున్నాయి.

రెండో రోజుకు సర్వశిక్ష ఉద్యోగుల సమ్మె



ఏలూరులో సమ్మె చేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల నిరవధిక సమ్మెలో భాగంగా రెండో రోజు గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కొనసాగించారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ పెద్దపెట్టున నినదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.సోమయ్య మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పిఆర్‌సి, నెల తరబడి వేతనాలు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి పనిభారం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని పోస్టులకు ఖచ్చితమైన జాబ్ చార్ట్ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. సమగ్ర శిక్ష జెఎసి నాయకులు భగవాన్, పాల్ రాజు, క్రాంతి, దిలీప్, బాలాజీ, రాజు, సత్య, చినబాబు, వై.శ్రీనివాసరావు, వీరమణి పాల్గొన్నారు.


నేటి నుంచి సమ్మెలోకి...

భీమడోలు:మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు, సిబ్బంది ఈనెల 22 నుంచి సమ్మెలోకి వెళ్లనున్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం సమ్మె నోటీసును మండల విద్యాశాఖధికారులకు అందజేశారు. ఈ క్రమంలో సమ్మెలోకి వెళితే జీతాలు వచ్చే పరిస్థితి లేదని ఉన్నతాధికారులు బెదిరించినప్పటికీ వారు లెక్కచేయకుండా సమ్మె నోటీసును అందించారు.

ఉద్యోగాల భర్తీలో అవినీతి సరికాదు : సిపిఎం

ఏలూరు అర్బన్:ఉద్యోగాలు అర్హత, ప్రతిభ, మెరిట్ ఆధారంగా ఇవ్వాలిగానీ అవినీతికి పాల్పడి ఉద్యోగాలు భర్తీ చేయడం ఏమిటని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రశ్నించారు. ఈ మేరకు ఆయనొక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగాల భర్తీలో పత్రికల్లో వస్తున్న వార్తలను చూస్తుంటే ఆవేదన, ఆందోళన చెందాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఉన్నతాధికారులే ఈ చర్యలకు పాల్పడితే యువత పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్‌లో వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్లు, డేటాఎంట్రీ ఆపరేటర్లు తదితర 68 ఉద్యోగాల భర్తీలో అర్హుల జాబితా తప్ప మెరిట్, తుది మెరిట్ జాబితాను ప్రచురించకుండా అభ్యర్థులను గందరగోళంలో నెట్టి నచ్చినవారికి, ముడుపులిచ్చినవారికి ఉద్యోగాలు కట్టబెట్టినట్లు వార్తలు రావడం అన్యాయమన్నారు. కంచెను చేను మేసినట్టు నిబంధనలు అమలు చేయాల్సిన ఉన్నతాధికారులే ఈ అక్రమచర్యలకు పాల్పడితే ప్రజలకు న్యాయం ఎలా అందుతుందని ప్రశ్నించారు. దీనిపై సుమోటాగా కేసు నమోదుచేసి, సమగ్రవిచారణ జరిపి, దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

క్లాప్ డ్రైవర్ల రిలే దీక్షలు ప్రారంభం



దీక్షలు ప్రారంభిస్తున్న డిఎన్‌విడి.ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

క్లాప్ ఆటోల డ్రైవర్లకు జిఒ ఏడు ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, వారాంతపు, పండుగ సెలవులు అమలు చేయాలని, యూనిఫారం, గుర్తింపు కార్డులివ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ డిమాండ్ చేశారు. క్లాప్ ఆటోల డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ దీక్షలను ప్రారంభించిన ప్రసాద్ మాట్లాడుతూ క్లాప్ ఆటోల డ్రైవర్లు సమస్యలపై ఆరు నెలలుగా ఆందోళన చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. క్లాప్ ఆటోల డ్రైవర్లు నైపుణ్యంతో కూడిన పని చేస్తున్నప్పటికీ, కనీస వేతనాలు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ నగరపాలక సంస్థ క్లాప్ ఆటోల డ్రైవర్ల కాంట్రాక్టర్లకు ఆటోకు నెలకు రూ.54 వేలు చెల్లిస్తుందని, కాంట్రాక్టర్‌కు జీతాలకు, నిర్వహణకు రూ.20 వేలు మాత్రమే ఖర్చవుతుందని, ఒక్కో ఆటోకు రూ.34 వేలు మిగులుతుందని, దానిలో కొంతభాగం క్లాప్ ఆటోల డ్రైవర్లకు వేతనాలుగా చెల్లించవచ్చని తెలిపారు. ప్రభుత్వం దళారీ వ్యవస్థ ఉండదని చెప్పి దాని ద్వారా క్లాప్ ఆటోలు కొనసాగించడం అన్యాయమన్నారు. సమస్యలు పర్కిరించనిపక్షంలో అవసరమైతే పనులు నిలుపుదల చేసి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. మొదటి రోజు రిలే దీక్షలో 16 మంది క్లాప్ ఆటోల డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి భగత్‌సింగ్, కుమార్‌రాజా, సాయిబాబా, ఏసుబాబు, అంబేద్కర్, ఇస్సాకు, సత్యానందం, గోపికృష్ణ తదితరులు నాయకత్వం వహించారు. ఈ దీక్షలకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎ.జాన్‌బాబు, పి.చిన్ననాగరాజు, తానంకి జార్జి, స్కూల్ స్వీపర్స్ నాయకులు కృష్ణవేణి, దుర్గమ్మ మద్దతు తెలిపారు.

మాతాశిశు మరణాల నివారణే అక్షజ లక్ష్యం : కలెక్టర్



ప్రజాశక్తి - ఏలూరు

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా గర్భిణుల్లో రక్తహీనత నివారణకు చేపట్టిన అక్షజ కార్యక్రమం మంచి ఫలితాలను సాధించే దిశగా సంబంధిత అధికారులు సమన్వయంతో కృషిచేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో టి.నరసాపురం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో అమలు చేస్తున్న అక్షజ కార్యక్రమం తీరుపై సంబంధిత అధికారులు, సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రతినిధులు, మార్పు సేవాసంస్థ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో గర్భిణులు రక్తహీనతవల్ల పడుతున్న ఇబ్బందులను అధికమించేలా రక్తహీనత నివారణకు, పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు ఈ కార్యక్రమాన్ని విజయవంతానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఇందుకు ప్రత్యేక పర్యవేక్షణ, డాక్యుమెంటేషన్ ఎంతో అవసరమని స్పష్టం చేశారు. అక్షజ ద్వారా చేపట్టిన పౌష్టికాహార కిట్ల పంపిణీతో పాటు వాటిని సంబంధిత లబ్ధిదారులు రోజువారీ వినియోగిస్తున్నతీరును తప్పనిసరిగా పరిశీలించాలని, అప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. 15 రోజులకొకసారి ప్రగతిని సమీక్షించాలన్నారు. ముఖ్యంగా సంబంధిత ఐసిడిఎస్ సిడిపిఒలు ముఖ్యభూమిక పోషించాలన్నారు. మెడికల్ ఆఫీసర్, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, తదితర వైద్య సిబ్బంది ప్రత్యేకంగా అక్షజ లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితులను ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. అక్షజ ద్వారా పౌష్టికాహారం పొందుతున్న వారి బరువు, రక్తహీనతను పరీక్షించడం ద్వారా ఏవిధమైన మార్పులు సంభవించిందీ పరిశీలించాలన్నారు. ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల, మార్పు సేవాసంస్థల సహకారంతో చేపట్టిన అక్షజ న్యూట్రిషన్ పైలెట్ ప్రాజెక్ట్ మంచి ఫలితాలు సాధించేందుకు ఐటిడిఎ పిఒ, ఐసిడిఎస్ పీడీ, మార్పు సేవాసంస్థ ప్రతినిధి ఆర్.సూయిజ్, సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రానున్న మూడు నెలల్లో 15 రోజులకు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎంఎల్‌ఎచే అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలులో పలు అభివృద్ధి పనులను ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు గురువారం ప్రారంభించారు. రూ.43 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాల య భవనం, రూ.30 లక్షలతో నిర్మించిన ఒహెచ్‌ఆర్ ట్యాంకులను ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ గ్రామసుపరిపాలన కోసం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి శాశ్వత కార్యాలయ భవనాలు, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. జగనన్నకాలనీల్లో మౌలిక వసతుల కల్పనలో జిల్లాకు ఆదర్శంగా చేబ్రోలు నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రాంథే లక్ష్మీసునీత, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు కొరిపల్లి జయలక్ష్మి, ఎంపిడిఒ ప్రేమాన్విత, ఎంపిటిసి సభ్యులు రాయి లక్ష్మి, మనసాల నాగమణి, సొసైటీ ఛైర్మన్ బాబ్జీ, ఎఎంసి మాజీ ఛైర్మన్ రమావతి, వైసిపి మండల కన్వీనర్ మంగారావు, నాయకులు కర్ణం బుజ్జి, ఆకుల రాజా, ముత్తా బుజ్జి, వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఒకటో తేదీనే వేతనాలివ్వాలని యుటిఎఫ్ వినతి

దెందులూరు:ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ ఆర్థిక బకాయిలు, ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని కోరుతూ దెందులూరు ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్యచౌదరికి యుటిఎఫ్ నేతలు గురువారం వినతిని అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్తఫా ఆలీ, రవికుమార్ రుద్రాక్షి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని, పిఎఫ్, ఎపిజిఎల్‌ఐ రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి జివి రమణ, దెందులూరు మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, మండల అధ్యక్షులు కెనడి, గౌరవ అధ్యక్షులు జయకుమార్, దెందులూరు కోశాధికారి శ్యామ్ పాల్గొన్నారు.

ప్రభుత్వం దిగొచ్చేవరకూ పోరు..!

ప్రజశక్తి - యంత్రాంగం

'ప్రభుత్వం దిగొచ్చి తమ డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె ఆగదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. గత పదిరోజులుగా అలుపెరగని పోరాటం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమని వారు ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యలు పరిష్కరించకపోగా బెదిరింపులకు పాల్పడుతూ, అంగన్వాడీ కేంద్రాల తాళాలను బద్దలుకొట్టి సచివాలయ సిబ్బందితో నిర్వహించాలని చూడటం సిగ్గుచేటని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీల సమ్మె గురువారానికి పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎక్కడికక్కడ మానవహారాలు నిర్వహించి నిరసన తెలిపారు. పలుచోట్ల నిరసన ప్రదర్శనలు చేపట్టారు. వీరికి వివిధ కార్మిక, ప్రజాసంఘాల, రాజకీయ పార్టీల నేతలు మద్దతు తెలిపారు.

లింగపాలెం : అంగన్‌వాడీలకు కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సమ్మెకు కార్మిక, ప్రజాసంఘాలు, వివిధ రాజకీయపార్టీలు, అభ్యుదయ ప్రజాస్వామ్య వాదుల మద్దతు రోజురోజుకీ పెరుగుతుందన్నారు. బిజెపి పేదరికం, చిన్నారుల్లో పోషకాహారలోపం, ఆకలి వంటి సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యంచేసి ఐసిడిఎస్‌కు నామమాత్రంగా నిధులు కేటాయించిందన్నారు. పెరుగుతున్న ధరలతో ఇది ఏ మాత్రమూ సరిపోదని, ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఎలా నడపాలని ప్రశ్నించారు. ఆకలి మరణాల సూచిలో మన దేశం 107వ స్థానంలో ఉందని, దీనినుండి బయటపడటానికి లబ్ధిదారులకు మెరుగైన ఆహారం అందించే దిశగా బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లను కుదించడానికి నూతన విద్యావిధానాన్ని తీసుకువచ్చి సెంటర్లను మెర్జ్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. లబ్ధిదారులను కుదించటానికి పోషణ ట్రాక్ యాప్‌ను తీసుకువచ్చిందన్నారు. 48 ఏళ్ల నుంచి గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అనేక సేవలందిస్తున్న అంగన్‌వాడీలకు కనీసం, ఉద్యోగ భద్రత లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగలేదని, సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని విమర్శించారు. అనేక రకాల యాప్‌లు తెచ్చి అంగన్‌వాడీలపూ పనిభారం మోపారని మండిపడ్డారు. సెంటర్ల బలోపేతానికి అవసరమైన నిధులు కేటాయించకుండా లబ్ధిదారులకు నాశిరకం సరుకులను సరఫరా చేస్తున్నారన్నారు. నూతనంగా గర్భిణులకు, బాలింతలకు ఫేస్‌యాప్ తీసుకొచ్చారన్నారు. ఫోన్లు పనిచేయకపోయినా, నెట్ సిగ్నల్ లేకపోయినా అమలు చేయాలని అధికారులు అంగన్వాడీలను మానసిక వేదింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు డి.దాస్, జ్యోతి, అంగన్వాడీల సంఘం నాయకులు బిజెఎన్.కుమారి, ఈశ్వరి, మేరీ, మార్తమ్మ, రజని, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్:అంగన్వాడీలు పోరాటానికి తమ సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎల్‌ఐసి ఏజెంట్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి గొట్టాపు రవికిషోర్ తెలిపారు. అంగన్వాడీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ చేపట్టిన సమ్మె పదో రోజుకి చేరింది. ఈ సందర్భంగా ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని ఎల్‌ఐసి యూనియన్ నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రవికిషోర్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు శాంతియుతంగా సమ్మె చేస్తుంటే సెంటర్ల తాళాలు బద్దలు కొట్టి, సెంటర్లను స్వాధీనం చేసుకుని అధికారులు నిరంకుశంగా వ్యవహరించడం సరికాదన్నారు. సిఎం జగన్ సానుకూలంగా ఆలోచించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం ధర్నా శిబిరం నుంచి ఫైర్ స్టేషన్ వరకూ ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి కిషోర్, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల ముందు వైసిపి అంగన్వాడీలకు తెలంగాణ కంటే అదనంగా జీతం ఇస్తామని హామీ ఇచ్చారని ఐదేళ్లు గడిచిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు టి.రజనీ, నాయకులు అరుణకుమారి రెడ్డి, రామలక్ష్మి, స్వప్న, నవతి సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాధరావు, ఎల్‌ఐసి యూనియన్ నాయకులు కనకారావు, చంద్రశేఖర్, రామకృష్ణ పాల్గొన్నారు.

పదో రోజుకు అంగన్వాడీల సమ్మె
పలుచోట్ల మానవహారాలు, నిరసన ప్రదర్శనలు



లింగపాలెంలో అంగన్‌వాడీల సమ్మె శిబిరం వద్ద మాట్లాడుతున్న ఎ.రవి

పెదపాడు : మండలంలో అంగన్‌వాడీల సమ్మె పదో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా స్థానిక బండ్ల తూము సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. తొలుత అంగన్వాడీలు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పెదపాడు ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎస్.తిరుపతమ్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు కె.శారద, నాయకులు సీతామహాలక్ష్మి, శ్రీకుమారి, దుర్గ, దేవమణి, వినీల, నాగలక్ష్మి, శివలీల పాల్గొన్నారు. సిపిఎం నాయకులు గుండపనేని సురేష్, షేక్ కరీముల్లా సమ్మెకు మద్దతు ప్రకటించారు.

భీమడోలు : అంగన్వాడీల నిరవధిక సమ్మె మండలంలో పదో రోజు కొనసాగింది. స్థానిక సాయిబాబా ఆలయ సమీపంలో ఏర్పాటుచేసిన శిబిరాన్ని సందర్శించిన పలువురు ప్రముఖులు వారికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు స్వర్ణ కుమారి, చెల్లామణి నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 64 అంగన్వాడీ కేంద్రాల అంగన్‌వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

నిడమర్రు : మండలంలోన అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం వరకూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ శేఖర్‌కు వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు వంగూరు శివరామలక్ష్మి, పి.సునీత, ఆల్తి భవాని, భలే సుమతి, గొల్ల దివ్య, మిద్దె జీవనజ్యోతి పాల్గొన్నారు.

చింతలపూడి : విశాఖలో సిఎం ప్యాలెస్ నిర్మాణానికి రూ.400 కోట్లు ఖర్చయిందని, కానీ అంగన్వాడీల వేతనాల పెంపునకు ఏడాది బడ్జెట్ అంత కూడా అవ్వదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె పదో రోజుకు చేరింది. ఈ క్రమంలో వైసిపి నేత శిబిరం వద్దకు చేరుకుని దురుసుగా వ్యవరించడంతో అంగన్వాడీలు తీవ్రంగా ఖండించారు. క్షమపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఫైర్‌స్టేషన్ వద్ద మానవహారంగా నిలబడి నినాదాలు చేశారు. అనంతరం రవి మాట్లాడుతూ సిఎం జగన్ అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. తెలంగాణ కంటే రూ.వెయ్యి అందనంగా ఇస్తామని హామీ ఇచ్చి మాటతప్పారన్నారు. ఈ సమ్మెకు సిపిఎం పూర్తి మద్దతు తెలుపుతుందన్నారు. అంగన్వాడీల సమ్మెను కొందరు వైసిపి నేతలు, కార్యకర్తలు సహించలేక దౌర్జన్యాలకు దిగుతున్నారని, ఇందుకు ఉదాహరణే చింతలపూడి శిబిరంలో ఓ కార్యకర్త మహిళలని కూడా చూడకుండా దౌర్జన్యానికి దిగడమేనన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ, మండల అధ్యక్షులు నత్త వెంకటేశ్వరావు, ప్రాజెక్ట్ అధ్యక్షులు సరోజని, సరళ, హేమలత, వెంకమ్మ పాల్గొన్నారు. ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు ఎం.త్యాగరాజు అంగన్వాడీలకు మద్దతు తెలిపారు. వారి న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షులు జెట్టి గురునాధం పాల్గొన్నారు.

ముసునూరు:అంగన్వాడీల వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించే వరకూ పోరాటం కొనసాగిస్తామని ఐసిడిఎస్ నూజివీడు ప్రాజెక్టు కార్యదర్శి పల్లిపాము రాజకుమారి అన్నారు. ముసునూరులో అంగన్వాడీల సమ్మె పదో రోజు కొనసాగింది. ఈ సమ్మెకు సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు అండగా ఉంటామన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గ, లక్ష్మీ, శిరీష, విద్యావతి, విజయలక్ష్మి, మేరీసులోచన పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : మండలంలో అంగన్వాడీల సమ్మె పదో రోజు లబ్ధిదారులు, అంగన్వాడీ పిల్లలు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెయిన్ రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించి గుడి సెంటర్లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు.

కొయ్యలగూడెం : మండలంలో అంగన్వాడీల సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ అంగన్వాడీలు అలుపెరగని పోరాటం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం కనీసం స్పదించడం లేదన్నారు. అంతేకాక అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగలకొట్టి ఇతరులతో నిర్వహించాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో బి.సత్యవతి, కె.జయసుధ, టి.శివలక్ష్మి, ఎన్.పోసిరత్నం, కె.శిరీష, బి.ప్రసన్న, వి.సత్యవతి, అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షులు శివరత్నకుమారి, పి.పద్మజ, జె.నాగవేణి, అడపా నాగజ్యోతి, సిహెచ్.సునీతరాయల్, బొబ్బిలి చిట్టి, జ్యోతి, మాధవి, భాగ్యలక్ష్మి, వెంకటలక్ష్మి, మంగ, శ్రీదేవి, నుర్జహాన్ పాల్గొన్నారు.

నూజివీడుటౌన్ : స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన అంగన్వాడీల నిరవధిక సమ్మె పదోరోజూ కొనసాగింది. ఈ సమ్మెకు నూజివీడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయవాదులు మద్దతు తెలిపారు.

చాట్రాయి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె పదో రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శిబిరాన్ని సిఐటియు పట్టణ అధ్యక్షులు పసల సూర్యారావు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు విమల మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు విమల, మండల, పట్టణ అంగన్వాడీ కేంద్రాల వర్కర్లు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: అంగన్వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు డివి.కృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మెను ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, కుశలవ వర్కర్స్ యూనియన్ నాయకులు కెవికె.ప్రసాద్, ఆర్.చంటి పాల్గొన్నారు.

టి.నరసాపురం : అంగన్వాడీల సమ్మె పదోరోజూ కొనసాగింది. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.రవి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు అనుమోలు మురళీ, అంగన్వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : అంగన్వాడీల నిరవధిక సమ్మె పదో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం ఎదుట వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఈ సమ్మెకు సిపిఎం, సిఐటియు, టిడిపి మద్దతు ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, కొండలరావు, ఎస్.సాయి, ఎంపిటిసి నాలి శ్రీను, అఖిల్, అంగన్వాడీలు నాగమణి, ఎస్తేరు, పూర్ణావతి, సరళ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : అంగన్వాడీల నిరవధిక సమ్మెకు జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి పాదం నాగకృష్ణ, మండల ఉపాధ్యక్షులు తీగల గోపాలకృష్ణ, ఏడుకొండలు అధికారిక ప్రతినిధి మెట్టా బుచ్చిరాజు ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, పోలవరం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం రాజా, కొక్కెర పద్మరాజు, ఇనుముల పున్నారావు, జోడెం కృష్ణమూర్తి, కైగాల సూరిబాబు, కూరం దుర్గారావు, మాణికల దుర్గారావు, మిరియాల సతీష్, కందుకూరి వెంకటేష్, ఆకుల పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

కలిదిండి : అంగన్వాడీల సమ్మె పదో రోజూ కొనసాగింది. ఈ సమ్మెలో అంగన్వాడీల యూనియన్ నాయకులు కె.సీతామహాలక్ష్మి, విజయలక్ష్మి, నాయకులు పి.మాణిక్యం, ఎం.సుధ, కె.చెల్లమ్మ, స్వరూపారాణి, డి.శివకుమారి, మండల నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనకలక్ష్మి, కొప్పినీడి రమాదేవి పాల్గొన్నారు.


భీమడోలు : రిలే నిరాహార దీక్షల్లో మహిళా న్యాయవాదులు

భూ హక్కు చట్టం రద్దు చేయాలి

3వ రోజుకు న్యాయవాదుల రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - భీమడోలు

భూ హక్కు యాజమాన్య చట్టం రద్దు కోరుతూ భీమడోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారంతో మూడో రోజుకు చేరాయి. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా న్యాయవాదులు కె.గీతారాణి, ఎల్.సుధారాణి, బి.రాణి దీక్షలను చేపట్టారు. న్యాయవాదుల గంగరాజు, రాజారావు, గోపాలకృష్ణ మాట్లాడారు.

జంగారెడ్డిగూడెం : భూ హక్కు చట్టం రద్దు చేయాలని న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. గురువారం కొనసాగింపుగా రిలే నిరాహార దీక్షల్లో న్యాయవాదులు జివిఎస్.మూర్తి, కొల్లూరి సతీష్, కట్ట రాజేష్‌కుమార్, గుమ్మళ్ల మణికుమార్ పాల్గొన్నారు. న్యాయవాదులు చేపట్టిన దీక్షకు ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ సభ్యులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు తల్లాడి అశోక్‌కుమార్, కార్యదర్శి ఎవివి.భువనేశ్వరి, న్యాయవాదులు మేకా ఈశ్వరయ్య, మానికల సూరిబాబు, పివిఎస్ఆర్‌కె.లక్ష్మణరావు, పివి.కృష్ణారెడ్డి, ముళ్లపూడి శ్రీనివాస్, గన్నమని శేఖర్, నూజివీడు రాంబాబు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌తో సృజనాత్మక శక్తి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని ఎస్ఆర్ఆర్ బాయ్స్ హైస్కూల్ ఆవరణలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా 'సేవియా' మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంపొందించేందుకు సైన్స్ ఫెయిర్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులు మేధాశక్తి ఉపాధ్యాయుల సలహాలు, సూచనలతో ఎన్నో పరికరాలను తయారుచేసి ప్రదర్శించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితులకు తపన ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు కోల్పోయిన బాధితులకి తపన ఫౌండేషన్ తన నిత్యావసర వస్తువుల అందించారు. మండలంలోని అచ్యుతాపురం పంచాయతీ శ్రీరంగపట్నంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో మానికల నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి దంపతులు నివాసం ఉంటున్న తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. తపన ఫౌండేషన్ మండల సేవా ప్రతినిధులు ఆడిటి ఏసుబాబు, ముసినిడి కావ్య నాగశ్రీలు వ్యవస్థాపకులు గారపాటి సీతా రామాంజనేయులుకు విషయం తెలిపారు. దీంతో వారు తక్షణ సహాయం కింద రూ.పదివేల విలువైన నిత్యావసర వస్తువులను సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మద్దిపాటి నాగమణి, బిజెపి గ్రామ అధ్యక్షులు చందంశెట్టి నాని, వైసిపి గ్రామ అధ్యక్షులు ముమ్మిడి సత్యనారాయణ, డ్వాక్రా అధ్యక్షులు లక్ష్మి పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులోని రోడ్ల పక్కన యాచకులకు, నిరాశ్రయులకు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి, మేనేజింగ్ కమిటీ మెంబర్లు బుధవారం రాత్రి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ శీతాకాలం కారణంగా ప్రస్తుతం రోజురోజుకూ చలి ఎక్కువవుతున్నందున రోడ్ల పక్కన, ఫుట్‌పాత్ మీద, దేవాలయాల దగ్గర పడుకునే నిరాశ్రయులకు, యాచకులకు రెడ్‌క్రాస్ సొసైటీ తరపున దుప్పట్లను పంచే కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి 54 మందికి దుప్పట్లను పంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, ట్రెజరర్ రేవూరి శివప్రసాద్, రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు బిఆర్‌సిహెచ్.నారాయణ, కె.సత్యనారాయణ, రెడ్‌క్రాస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్స్ ఆరోగ్యానికి హానికరం

ప్రజాశక్తి - మండవల్లి

కూల్‌డ్రింక్స్ ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని, సహజ సిద్ధమైన పానీయాలు సేవించడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. స్థానిక విశ్వభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూలులో పరిరక్షణ ఐక్యవేదిక మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కూల్‌డ్రింక్స్ తాగడం ద్వారా వచ్చే ఆరోగ్య సమస్యలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో మాట్లాడారు. కూల్‌డ్రింక్ ఆరోగ్యానికి మంచిది కాదన్నారు. కూల్‌డ్రింక్స్‌లో ఎక్కువ మొత్తంలో చక్కెర కృత్రిమ రంగులతో పాటు ప్రాణాంతకమైన 21 రకాల విష పదార్థాలతో కూడిన కెమికల్స్ ఉన్నాయన్నారు. కూల్‌డ్రింక్స్‌లో ఉండే పాస్పరిక్ యాసిడ్ కార్బోలిక్ యాసిడ్ వంటివి ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమని తెలిపారు. అందుకే వాటిని తాగిన వెంటనే తేన్పులు వస్తాయన్నారు. అంతేకాకుండా వాటి వల్ల కడుపులో మంట, గ్యాస్ వంటి సమస్యలు తలెత్తడంతో పాటు ఆకలి మందగిస్తుందని, కిడ్నీలపై ఒత్తిడి పెరుగు తుందని, ఊపిరితిత్తులు దెబ్బతిని శ్వాసకోశ వ్యాధులు వసా యని తెలిపారు. కూల్‌డ్రింక్స్ బదులుగా పండ్లు, రసాలు, సహజసిద్ధమైన పానీయాలైన చెరకు, నిమ్మరసం, కొబ్బరి బొండం, కీరదోస, పుదీనా, టమోటా జ్యూస్ వంటివి తాగడం ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. ఈ కార్యక్ర మంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్. భాస్కరరావు అప్పారావు, మండల కన్వీనర్ నాగబాబు, ఉపాధ్యాయులు సోనియా, నాగమల్లి పాల్గొన్నారు.

కనసానపల్లిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రేమతత్వమే క్రీస్తు మార్గమని, ప్రతిఒక్కరూ తోటివారి పట్ల ప్రేమానురాగాలు కలిగి ఉండాలని రెవ బి.ప్రేమ్‌కుమార్ అన్నారు. మండలంలోని కనసానపల్లి పరిశుద్ధ పౌల్ సిఎస్ఐ చర్చి వద్ద పాస్టర్ కె.ఐజక్‌జాన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 కె.ఆనంద్‌కుమార్, ఐబి.రవికుమార్, రెవ సిహెచ్.శశిధర్, సురేష్, డి.సుజిత్‌కుమార్ పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న ఆగిరిపల్లి ఎస్ఐ చంటిబాబు

గోపీనాథపట్నంలో భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి - ఉంగుటూరు

గోపీనాథపట్నంలో భక్తాంజనేయస్వామి ఆలయ శిఖర ప్రతిష్ట కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి, ఆలయ ధర్మకర్త కొట్టు సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కొట్టు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

తల్లి మందలించిందని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తల్లి మందలించిందని యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని బర్రింకలపాడులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బర్రింకలపాడు గ్రామానికి చెందిన యువకుడు కారం రాహుల్ (22) అతని తల్లి మందలించిందని పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన స్థానికులు అతడిని హుటాహుటిన జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అశ్వారావుపేటలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

మూఢ నమ్మకాల నిర్మూలనకు జెవివి కృషి


బహుమతులతో విద్యార్థులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మూఢ నమ్మకాల నిర్మూలనకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందని పలువురు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ గురువారం నిర్వహించారు. మండలంలోని 17 ఉన్నత పాఠశాలల నుంచి, పాఠశాల స్థాయిలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్టులో 8, 9, 10 తరగతుల నుంచి ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు దాదాపు 50 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఇఒ తెల్లం బాబూరావు సైన్స్ ఔన్నత్యం గురించి విద్యార్థులకు వివరించారు. మరొక అతిథి బుట్టాయగూడెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇరపా గంగాదేవి సమాజంలోని మూఢ నమ్మకాల నిర్మూలనకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని కీర్తించారు. ఈ పోటీల్లో బుట్టాయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గొల్ల అభిషేక్, తిప్పు తేజస్ నాగ కుమార్, నెట్ల సుధీర్ వర్మ ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తెల్లంవారిగూడెం గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల విద్యార్థులు మడకం వైష్ణవి, పూణెం చందన, సోడెం ఊహ ద్వితీయ బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు గుర్రం గంగాధరరావు, కార్యదర్శి బుద్దుల లక్ష్మణరావు, కొవ్వాసి రాజుదొర పాల్గొన్నారు.

'మైనార్టీల సంక్షేమానికి పలు పథకాలు'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అధ్యక్షతన మైనారిటీల హక్కులపైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నాయన్నారు. ఈ సంక్షేమ పథకాలు పొందడంలో సమస్యలు ఎదురైతే జిల్లా న్యాయసేవాధికార సంస్థను ఆశ్రయించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిపి బిజె.రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీతారాం, న్యాయవాది కూనా కృష్ణారావు, కె.రత్నంరాజు, మైనారిటీ సంక్షేమ అధికారి అక్బర్ బాషా పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతుల జాబితా పరిశీలన

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కొత్త పట్టిసీమలో పంట నష్టపోయిన రైతుల జాబితాను ఎంపిడిఒ జి.శ్రీను, మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు పరిశీలించారు. తుపాను వల్ల నష్టపోయిన పంట పొలాలను, ఆరబెట్టిన ధాన్యం రాసులను పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడారు. అనంతరం పోలవరం, గూటాల గ్రామాల్లో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం కోసం ఆటస్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విలేజ్ లెవల్ కమిటీ, రైతులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి విస్తరణపై సమీక్ష

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెం నుంచి పోలవరం వరకు జాతీయ రహదారి 365(బిబి)కు సంబంధించి విస్తరణ సర్వే పనులపై స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జాతీయ రహదారి డిఇఇ, ఎఇల ఆధ్వర్యంలో మండల రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సర్వేయర్లతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో రహదారి విస్తరణకు చేయాల్సిన సర్వే పనులకు సంబంధించి పడే గ్రామాల గుండా రహదారి ఇరు వైపులా గల సరిహద్దులను సర్వే చేసి పాయింట్స్ ఇవ్వాలని ఆదేశించారు. సర్వే సమయంలో ఆయా గ్రామాల విఆర్ఒలు, సర్వేయర్లు ఉండి సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుందర్‌సింగ్, జాతీయ రహదారి డిఇఇ, మెహర్ ప్రభు, ఎఇ ఖాజా, విఆర్ఒలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ స్థాయి నృత్యోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నగరానికి చెందిన ప్రముఖ నృత్య సంస్థ అభినయ నృత్య భారతి 28వ జాతీయ స్థాయి నృత్యోత్సవాలు, నృత్యపోటీలు హేలాపురి లయన్స్ క్లబ్ సర్వీస్ ట్రస్ట్, లయన్స్ జిల్లా 316జి, నెహ్రూ యువకేంద్రం, హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఎ) సహకారంతో డిసెంబర్ 22, 23, 24 తేదీల్లో ఏలూరు వైఎంహెచ్ఎ హాలులో నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్ గోపాల్ లునాని, నాట్యాచార్య లయన్ దువ్వి హేమసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు పది రాష్ట్రాల నుంచి విచ్చేస్తున్న 16 మంది ఉత్తమ నర్తకులకు శివ గోపాల్ లునాని, బ్రిజ్‌గోపాల్ లునాని మెమోరియల్ నృత్య కౌముది అవార్డులు, సేవా రంగం నుంచి, నృత్య రంగం నుంచి ఎంపిక చేసిన ప్రముఖులకు కొరాడ నరసింహారావు స్మారక సేవా తపస్వి, నృత్య తపస్వి అవార్డులు, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి విచ్చేస్తున్న 400 మంది చిన్నారులకు కానాల గురుమూర్తి , వెంకట నారాయనమ్మ స్మారక నృత్య పోటీలు నిర్వహిస్తున్నామని, ఇవి సీనియర్, జూనియర్, సబ్ జూనియర్, గ్రూపు పద్ధతిలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి సొంగా సిద్దు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం సిఎం జగన్ చిత్ర పటానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిద్దు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆయుష్మాన్ భారత్ హెల్త్, వెల్‌నెస్ సెంటర్లలో (వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్) విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు 11 నెలల నుంచి ఇన్సెంటివ్స్ (ప్రోత్సాహకాలు) అందడం లేదని, జీతాలు కూడా సకాలంలో రావటం లేదని, హెల్త్ సెంటర్లకు అద్దెలు, కరెంట్ బిల్లులు తామే కడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 2023లో రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులందరికీ 23 శాతం శాలరీ ఇంక్రిమెంట్ ఇచ్చి గత ఐదేళ్ల పాటు సేవలందించిన సిహెచ్‌ఒలకు మాత్రం ఒక్క రూపాయి కూడా జీతం పెంచలేదని ఆయన తెలిపారు. తమకు హెచ్‌ఆర్ఎ ఇవ్వకపోగా తమకు వస్తున్న ఇన్సెంటివ్స్ రూ.నాలుగు వేల నుంచి రూ.ఐదు వేలకు కుదించి, హెడ్ క్వార్టర్స్‌లో నివసించేందుకు ఆ కుదించిన మొత్తాన్ని ఇస్తామని అధికారులు చెప్పడం బాధాకరమన్నారు. వీటన్నిటి వల్ల సిహెచ్‌ఒలంతా అప్పులపాలై ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విలేజ్ క్లినిక్స్‌లో అందిస్తున్న సేవలను గుర్తించి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు రాజు, విజయ్, నాగబాబు, నవ్య, లావణ్య, నాగ జగదాంబ పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

అనారోగ్య బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయమై ఆపరేషన్ అవసరమైన వ్యక్తికి దాత నాటకాల వెంకటరాజు రూ.1.50 లక్షలు అందించారు. మండలంలోని గవరవరం గ్రామానికి చెందిన తప్పెట్ల శ్రీనివాస్ ప్రజాశక్తి దినపత్రికలో కొయ్యలగూడెం మండల విలేకరిగా పనిచేస్తూ ఉండగా గత సంవత్సరం డిసెంబర్ 25వ తేదీన రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో రాజమండ్రిలో ఒక ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. అప్పటి నుంచి శ్రీనివాస్ ఇంటి వద్దనే ఉంటూ ఫిజియోథెరపీ వైద్యులు వద్ద చికిత్స పొందుతున్నారు. శ్రీనివాస్‌కు మెరుగైన వైద్యం అందించాలని, తలకు బలమైన గాయం కావడంతో ఆపరేషన్ చేయాలని తెలపడంతో నిస్సహాయ స్థితిలో ఉన్న శ్రీనివాస్ పరిస్థితిని తెలుసుకున్న గ్రామానికి చెందిన నాటకాల వెంకటరాజు రూ.1.50 లక్షలు శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందించారు. వెంకట్రాజు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, మానవత్వంతో ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారని పలువురు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో విలేకర్లు ఎం.సాయిబాబా, పూలపల్లి కృష్ణబాబు, బొబ్బరి కిషోర్, చిటికెన రమేష్, మన్నె దుర్గబాబు, శివ కళ్యాణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా భీమడోలు మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు రూ.33 వేల విలువైన ట్యాబ్, బైజుస్ సంస్థకు చెందిన సబ్జెక్ట్ మెటీరియల్ కంటెంట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు హాజరయ్యారు. ప్రస్తుత విద్యా సంవత్సరం మండలానికి విడుదల కావాల్సిన 647 ట్యాబ్‌ల్లో తొలి విడతగా మంజూరైన 290 ట్యాబ్‌లను పంపిణీ చేశారు. విద్యా సంస్కరణలో భాగంగా ఒకటి నుంచి మూడో తరగతి, ఆ తర్వాత వివిధ తరగతులకు అవసరమైన సమాచారాన్ని వివిధ రూపాల్లో అందించే ఏర్పాట్లను ప్రభుత్వం చేసిందన్నారు. ట్యాబ్‌లు కేవలం నిర్ణీత అంశాలను మాత్రమే తెలియజేస్తాయన్నారు. వాటిని విద్యార్థులు ఇతర అంశాలకు వినియోగించే అవకాశం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమడోలు సొసైటీ అధ్యక్షులు రావిపాటి సత్యశ్రీనివాస్, జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానిరంగా, రామకుర్తి నాగేశ్వరరావు, భీమడోలు తహశీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముసునూరు : పేదింటి పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో తమ సత్తా చాటేందుకు సిఎం జగన్ కృషి చేస్తున్నారని ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు గురువారం ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకొచ్చిన తర్వాత సంక్షేమ పథకాలతో పాటు, అభివృద్ధి, విద్య, వైద్య రంగంలో రాష్ట్రాన్ని సిఎం జగన్ అత్యున్నత స్థానంలోకి తీసుకెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు డాక్టర్ ప్రతాప్, ఎంపిపి కొండా దుర్గాభవాని వెంకట్రావు, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, వైస్ ఎంపిపి-2 పాముల గంగాధరరావు, సర్పంచి పేరం కృష్ణ, కంభాల రాంబాబు, ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ దాసరి సుధ పాల్గొన్నారు.

చింతలపూడి : అంతర్జాతీయ వేదికలపై ఎపి విద్యార్థులు ప్రతిభ కనబర్చాలనే ఉద్దేశంతో ట్యాబ్స్ పంపిణీ పథకాన్ని సిఎం జగన్ ప్రవేశపెట్టారని ఎంఎల్ఎ ఎలిజా అన్నారు. పట్టణంలో ప్రభుత్వ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ట్యాబ్‌లలో రూ.15,500 విలువైన బైజూస్ కంటెంట్‌ను ప్రిలోడెడ్‌గా ఇస్తున్నామన్నారు. ట్యాబ్ ధర రూ.17,500తో కలిపి ప్రతి విద్యార్థికి రూ.33 వేల మేర లబ్ధి కలుగుతుందని చెప్పారు. విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లలో ఇంటర్మీడియెట్ కంటెంట్‌ను కూడా అప్‌లోడ్ చేసేలా మార్పులు చేశామన్నారు. ఈ ట్యాబ్‌లను దుర్వినియోగం చేయకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అవాంఛనీయ సైట్లు, యాప్స్‌ను నిరోధించే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌బిల్ట్‌గా పొందుపరిచినట్లు చెప్పారు.


భీమడోల : ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు

ఘనంగా సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలు

సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలను జిల్లాలోని పలు మండలాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

స్థానిక గన్‌బజార్-2 సచివాలయంలో సచివాలయల ఉద్యోగుల సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి రీజనల్ కో-ఆర్డినేటర్ జివిఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఎంఎల్ఎ ఆళ్ల నాని, నగర పాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు హాజరయ్యారు. కేక్ కట్ చేసి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

భీమడోలు : భీమడోలు భవిత కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భీమడోలు సొసైటీ అధ్యక్షులు, పార్టీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ పిల్లలకు చలికాలాన్ని దృష్టిలో పెట్టుకుని స్వెట్టర్లు పంపిణీ చేశారు. వైసిపి కార్యకర్తలు, నాయకులు మిఠాయిలను పంచారు. ఈ సందర్భంగా సహిత విద్య భీమడోలు రిసోర్స్ పర్సన్లు మాట్లాడుతూ భవిత కేంద్రం పిల్లలకు వారి అవసరాలకు తగిన విధంగా సదరం సర్టిఫికెట్లు మంజూరు కావడం లేదన్నారు. దీని కారణంగా వివిధ రూపాల్లో వారికి అందాల్సిన ప్రభుత్వ లబ్ధి చేరటం లేదని ప్రముఖుల దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ప్రజా ప్రతినిధులు, పార్టీ ప్రముఖులతో పాటు స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్‌సింగ్ మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్లు కావాల్సిన భవిత కేంద్రం పిల్లల బాధ్యులు పిల్లల అవసరాల గురించి, కావాల్సిన సౌకర్యాల వివరాలను అవగాహన లోపం కారణంగా నమోదు చేసుకోవడంలో విఫలమవుతున్నారన్నారు. దీని కారణంగా వారికి సదరం సర్టిఫికెట్ జారీలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు గుర్తించామన్నారు. ఈ లోపాలను సవరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానిరంగా, సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పి.సునీత మాన్సింగ్ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : పట్టణంలో సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలను ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన పట్టణ ప్రధాన కూడలి వద్ద కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని కాట్రేనిపాడు గ్రామంలో కేక్ కట్ చేసి, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసిపి కాట్రేనిపాడు గ్రామ అధ్యక్షులు రాంబాబు, సోషల్ మీడియా మండల కన్వీనర్ దాసు మాట్లాడారు. లోపూడిలో జెడ్‌పిటిసి సభ్యులు డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, సర్పంచి పేరం కృష్ణ, పార్టీ గ్రామ అధ్యక్షులు బి.నరసింహారావు ఆధ్వర్యంలో, రమణక్కపేటలో ఎంపిపి కొండా దుర్గాభవాని వెంకట్రావు, సర్పంచి రంగు ధనలక్ష్మి గాంధీ ఆధ్వర్యంలో గుళ్లపూడిలో రాజుబోయిన శ్రీదేవి శ్రీనివాసరావు, వేల్పుచర్లలో సర్పంచి పుట్ట మోహనరావు, ఉప సర్పంచి పటాపంచల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, గోపవరంలో వైస్ ఎంపిపి-2 పాముల గంగాధరరావు ఆధ్వర్యంలో, ముసునూరులో మాజీ సర్పంచి రేగుల గోపాలకృష్ణ, మండల యూత్ అధ్యక్షుడు గూటు రంగారావు, కొర్లకుంట సర్పంచి నక్కనబోయిన సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.

చింతలపూడి : పట్టణంలో చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ ఎలిజా పార్టీ కార్యకర్తలతో పార్టీ కార్యాలయం వద్ద సిఎం జగన్ పుట్టినరోజు వేడకలు ఘనంగా నిర్వహించారు. ఎఎంసి కార్యాలయం వద్ద ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎఎంసి వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు.

గ్రూపుల పోరు బహిర్గతం

సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలను వేర్వేరుగా నిర్వహించడంతో గ్రూపు పోరు బహిర్గతమైందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. సిఎం జగన్ పుట్టినరోజు ఫ్లెక్సీల్లో ఎంఎల్ఎ ఫొటో లేదని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటివరకు గ్రూపుపోరు అంతర్గతంగా ఉన్నా బహర్గతం కాలేదని, ఇన్‌ఛార్జుల మార్పులు జరగటంతో గ్రూపుపోరు బయటపడిందని స్థానికులు చెబుతున్నారు.

టి.నరసాపురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు మాట్లాడారు. కేతవరంలో వైసిపి జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వాసిరెడ్డి మధు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపిపి డి.లక్ష్మి వెంకటేశ్వరరావు, వైసిపి మండల కన్వీనర్ శ్రీనురాజు, సర్పంచి మోదుగు సునంద, ఎంపిటిసి సభ్యులు నార్లపాటి వెంకటేశ్వరరావు, ఎంఇఒలు టి.రామ్మూర్తి, ఎస్.కల్యాణి, హెచ్ఎం బిఎల్.స్వామి, ఆర్‌విజి.కృష్ణారావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వైసిపి నేతలు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు వీరబాబు, ఎంపిపి అనూష, నరసింహరావు, హరిబాబు, శ్రీనివాసరావు, సురేష్ కుమార్, భాస్కర్ ప్రసాద్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : వైసిపి పట్టణ అధ్యక్షులు చిటికెన అచ్యుతరామయ్య అధ్యక్షతన నిర్వహించిన సిఎం జగన్ పుట్టినరోజు వేడుకల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక గంగానమ్మ ఆలయ సెంటర్ వైఎస్ఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. అనంతరం జంగారెడ్డిగూడెం నుంచి గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఏలూరు పార్లమెంట్ జిల్లా మహిళా అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ పాల్గొన్నారు.

ముదినేపల్లి : గురజ రోడ్డు సెంటర్‌లో పార్టీ శ్రేణులు కోలాహలాల మధ్య కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. మండలంలోని చిగురుకోటలో 500 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ బోర్డు డైరెక్టర్ గంటా సంధ్య, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ, రాష్ట్ర బిసి నాయకులు కోమటి విష్ణువర్ధన్, గంటా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని కోండ్రుకోట పంచాయతీలో సర్పంచి అధ్యక్షతన కేక్ కట్ చేసి కమ్యూనిటీ హాలులో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పైదా నాగరాజు, ఐటిడిఎస్ డైరెక్టర్ గంగు అనిల్‌కుమార్, రెడ్డి గణపవరం ఎంపిటిసి మోహన్ మూలం కుమారి, సచివాలయ కన్వీనర్ గంగు రామలక్ష్మి పాల్గొన్నారు.

మండవల్లి : మండవల్లిలోని పాస్టర్ నిరంజన్ రావు ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. జిల్లా స్టీరింగ్ కమిటీ మాజీ సభ్యురాలు తిరువీధుల శారద మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న శారద ఫౌండేషన్ తరపున సుమారు 800 చీరలను పంపిణీ చేశారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో చైతన్య ప్రతిభ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో ఛత్రపతి శివాజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బి.చైతన్య విజయం సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా చైతన్యను గురువారం అభినందించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నిట్లా వినయ్‌ను అభినందించారు.

బాబూరావు మృతి బాధాకరం

మండవల్లి : మణుగులూరు సర్పంచి మోగనాటి తులసికల్యాణి భర్త బాబూరావు మృతి బాధాకరమని ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామచంద్రమూర్తి అన్నారు. బాబూరావు మృతదేహాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో గొప్ప వ్యక్తిత్వం గల మనిషి బాబూరావు అని అన్నారు. వైసిపిలో కీలకంగా వ్యవహరించారు, గ్రామంలో పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. బాబూరావు కుటుంబసభ్యులను పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచి సంఘాల అధ్యక్షుడు బేతపూడి ఏసేబురాజు, మండల సర్పంచుల మండల అధ్యక్షులు ఝాన్సి, పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్, మంగర మల్లికార్జునరావు, మండా సురేష్, చంటిబాబు, ప్రేమ్‌కుమార్ పరామర్శించారు.

ఉపాధి హామీ మేట్లకు శిక్షణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉపాధి హామీ మేట్ల విధులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని ఎంపిడిఒ ప్రేమాన్విత అన్నారు. ఉంగుటూరు ఎంపిడిఒ కార్యాలయంలో మేట్ల విధులు, ఎన్ఎంఎంఎస్ యాప్, హాజరు పలు అంశాలపై ఒక రోజు శిక్షణా తరగతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి గంటా శ్రీలక్ష్మి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ట్రైనింగ్ రిసోర్స్ పర్సన్‌గా ఎపిఒ పి.కిషోర్, టెక్నికల్ అసిస్టెంట్ పి.విజయ్ వ్యవహరించారు.

IN THE COURT OF THE IV ADDL.DISTRICT AND SESSIONS JUDGE, TANUKU
D.O.P.NO.47/2023

Between:
Myle Ambetkar ...*Petitioner*
AND
Myle (Nethala) Padma ...*Respondent*
To:
Myle (Nethala) Padma, W/o Ambetkar, C/o Nethala Muthyya, ANDALURU, Veeravasaram, Mandal, W.G.Dt (A.P).

పిటీషనరు తరుపున చేయించిన ప్రకటన

యిందుమూలముగా రెస్పాండెంటుకు తెలియజేయునది పై నెంబరు పిటీషన్‌లో కోర్టు ద్వారా నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు నోటీసులను పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు వేసియున్నారు. కావున మీరు **ది. 05-01-2024 వ తేదిన ఉదయం గం॥ 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని హజరై అభ్యంతరరములు తెలుపుకోవలెను. లేనిచో మీ పరోక్షములో పిటీషను విచారించబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
ఎ.వి.సత్యనారాయణ
తణుకు పిటీషనరు తరపు అడ్వకేటు, తణుకు
18-12-2023 సెల్: 9494338899

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 121/2008

Between:
వాది: మోకా సత్యనారాయణరాజు వర్మ
ప్రతివాదులు: మోకా కిషోర్ వర్మ, వగైరా

10వ ప్రతివాది అడ్రసు: నడకుదుటి నాగమణి, W/o. పాండురాజు (లేటు), వయస్సు 60 సం॥లు, గృహిణి, R/o. కొత్తపూసలమూరు, భీమవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, BJCJC.

11వ ప్రతివాది అడ్రసు: బర్రి పద్మ, D/o. పాండురాజు (లేటు); వయస్సు 40 సం॥లు, గృహిణి, R/o. బంటుమిల్లి, కృష్ణా జిల్లా, BJCJC.

పై నెంబరు దావాలో మీకు జారీ కావలసిన దావా సమనులు చాలా పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్డు పోస్టు ద్వారాను పంపించినప్పటికి మీరు తీసుకొనక నిరాకరించినందున **ది. 10-01-2024 తేదీన ఉదయం 10.00 లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలను తెలియపరచుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

PODUGU SRINIVASA RAO
PODUGU ANURADHA
PODUGU SAI HARIKESH
భీమవరం Advocates, Bhimavaram
ది.21-12-2023 Cell: 9849154471

మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు వారి కోర్టులో
E.P. No. 79/2020 in O.S. No. 365/2009

బిట్వీన్:
M/s. శ్రీరామ్ చిట్స్ (P) Ltd., ఏలూరు బ్రాంచి ...*డిక్రీ హోల్డర్*
అండ్
K.D.A.Rama Krishna మరియు యితరులు ...*జె.డి.ఆర్స్*

యిందు పై నెంబరు ఇ.పి గ్రంధములో ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని పై కోర్టులో వేలం వేయబడును. యావన్మంది పాటలో పాల్గొనవచ్చును. వేలము **ది. 08-01-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయుదురు. పబ్లికేషన్ ద్వారా తెలియపర్చడమైనది.

షెడ్యూలు

West Godavari District, Eluru Mandal, Eluru Sub Registrar, Tangellamudi Village vacant site in R.S. No. 59/11 and an extent of 323-4-0 sq.yards out of full extent Ac. 4-08 cents bearing Door No. 1-114 bounded by:
EAST: 24 ft Road - 42.0 ft. **SOUTH:** Site of Polagani Gopala Krishna - 67.0 ft. **WEST:** Kadiyala Chandrayya and others site - 44.9 ft. **NORTH:** Bellamkonda Venkateswara Rao site - 67.3 ft.
Vacant site with all easementary rights.
DHR Value: Rs. 15,00,000/-
Amin Value: Rs. 50,00,000/-

(అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
K.V.S.N.R.GOPAL
Eluru Advocate, Eluru
21-12-2023 Cell: 9949885456